చిన్న కథ



# దడిగాడువానసిరా

రామూ కళ్ళు జ్యోతుల్లా మెరిశాయి. వెనకా ముందు మరి చూళ్ళేదు నలుపురంగులో ఎండపడి తళతళా మెరుస్తున్న పర్సు చూసిందే తడువుగా వంగి తీసుకొన్నాడు. అంతలోనే తనకి ఎదురుగా రిక్షారావడం, రిక్షాలో సూట్‌వాలా "రిక్షా! ఆపు ఆపవోయ్!" అనడం విని ఉలిక్కి పడ్డాడు. రిక్షావాలా తనకి నాలుగ గడుగుల దూరంలో రిక్షా ఆపడం, సూట్‌వాలా తన వైపుకి తిరిగి చూడ్డం యథావిధిగా జరిగిపోయాయి.

రామూ పర్సు జేబులో తొయ్యబోతూ చూడకూడదనుకుంటూనే సూట్‌వాలా వైపు చూశాడు. ఆ దరిద్రపు క్షణంలోనే ఇద్దరి చూపులూ కలిశాయి. రామూ ముఖంలో భావాలు మాపి నల్లబడ్డాయి. 'ఈ పర్సు అతనిదేనేమో?' ప్రశ్నించుకున్నాడు లోలోనే. 'కాదు. కానేకాదు. పర్సు తీసిన తర్వాతే రిక్షా వచ్చింది.' సమాధానపరచుకున్నాడు వెంటనే 'సిరి వస్తుంటే మోకాళ్ళడ్డవైనట్టు ఏమిటిది?' డీలా పడిపోయాడు. ఆ కాసిన్ని క్షణాల్లోనూ విపరీతమైన సంఘర్షణ. కాలంకంటే వేగంగా పరిగెత్తిన ఆలోచన్లు. ఏదేమైనా సూట్‌వాలాకి పర్సు ఇచ్చేందుకు రామూ మనసు ససేమిరా అంగీకరించలేదు.

రామూ దరిద్రపు జీవితం నిజాయితీ కూడా నశింపజేస్తుందని సిగ్గుపడలేదు. 'ఇన్నాళ్ళకి భగవంతుడు కొంచెం కరుణిస్తే, ఏమిటీ మనుష్యులిలా అడ్డుపడుతున్నారు?' తనలోతనే ఏదో అజ్ఞాత శక్తిని దీనంగా, మౌనంగా ప్రశ్నించాడు రామూ.

రామూని కష్టాలు వరించినంతగా తను వరించలేదు. అతని జీవితం దరిద్రంలో మునిగి ఉంది. తండ్రిలేడు, తల్లీ, తోబుట్టువులూ ఉన్నారు. తనే ఇంటి పెద్ద. ఇంట్లో తన చాలీ చాలని సంపాదన ఆకలి, కన్నీళ్ళు, బాధలు, సమస్యలు. వెరసి ఒంటి పూట పస్తులు. అటువంటి తనకి రెండు రోజులు హాయిగా గడిచేందుకు పర్సు దొరికితే, ఈ మనిషి, ఈ సూట్‌వాలా కాకుండా చేస్తాడా? ఎలా? ఏం చెయ్యాలి? ఎటు పరిగెత్తాలి? ఎలా తప్పించుకోవాలి? అనుకుంటుండగానే—




"ఏయ్? అబ్బాయ్!" పిల్చాడు సూట్ వాలా.

జేబులో ఇముడుకుపోబోయిన పర్సు పైకితీసి నిరాశగా చూశాడు రాము.

"ఈ పర్సు నాది. నాకు దొరికింది" చెప్పాలనుకునే చెప్పలేకపోయాడు.

"మీ పర్సేనా?" ముందుకు వెళ్ళి అందించాడు.

సూట్ వాలా పర్సు అందుకుని జేబులో తోసుకుంటుంటే, మౌనంగా ప్రతిమలా నిలబడిపోయాడు.

రిక్షా కదలబోతుందనగా —

"పర్సు విప్పి చూసుకోండి. డబ్బు ఉందో లేదో!" అన్నాడు ఎలాగో.

"పరవాలేదు."

"పరవాలేదని కాదు. చూసుకోండి."

అతను పర్సు విప్పి చూశాడు. దమ్మిడీ అయినా లేదు. పైగా ఏదో కాగితం ప్లాస్టిక్ పేపర్‌కింద అక్షరాల్తో కనిపించింది. సూట్ వాలా కళ్లు అతనికి తెలీకుండానే చదివాయి.

"ఈ దరిద్రపు పర్సు ఎవరి చేతుల్లో కొస్తుందో వాడు గాడిద."

అదృశ్యంగా ఎవరో తెరలుతెరలుగా నవ్వుతున్నారు

రాముని కోపంగాచూస్తూ. "రిక్షా!పోనీ వోయ్!!"అన్నాడు విసురుగా సూట్ వాలా.

రాము మాత్రం నవ్వుతూ "ఇంతకీ పర్సు మీదేనా!" అనడిగాడు.

మొత్తానికా పర్సు "దడిగాడువాన సిరా"ది.

—లక్కోజు రాజాగణేష్